సాక్షి
వికారాబాద్
శనివారం । 4 । అక్టోబర్ । 2025



కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. 9లో▸



వికారాబాద్ పట్టణంలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న జనం

భక్తిశ్రద్ధలతో దసరా

విజయదశమి పండుగను గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేడుకల చివరి రోజు అమ్మవారు నిజరూప దర్శనమిచ్చారు. ఆలయాల్లో దుర్గామాతకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా అని పలువురు పేర్కొన్నారు.

– అనంతగిరి



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న మహిళలు



తాండూరు పట్టణంలో రావణ దహనం

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే బీఎంఆర్ తదితరులు

తాండూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాండూరు నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కొడంగల్‌కు వచ్చిన సీఎంను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కలిశారు. విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, నాగేష్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన టీఆర్‌ఆర్



ముఖ్యమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: కొడంగల్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొడంగల్ రూరల్: చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని అయినన్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మల్లేశం(39) మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి గొడవ జరగడంతో బయటకు వెళ్లిపోయాడు. అయినన్‌పల్లి గేటు సమీపంలోని వెంచర్‌లో ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం గమనించిన అక్కడి వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి చిన్నాన్న నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ -2 సత్యనారాయణరాజు తెలిపారు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సబితారెడ్డిని కలిసిన ఆనంద్

అనంతగిరి: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తి మృతి



మ్యాన్ హోల్‌లో మాసయ్య మృతదేహం

తాండూరు: తాగిన మైకంలో తాగునీటి మ్యాన్ హోల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత తాండూరు అంబేడ్కర్ పార్కులో తాగునీటి మ్యాన్ హోల్ ఉంది. ఇదే కాలనీకి చెందిన మాసయ్య(50) తాగిన మైకంలో అందులో పడి మృతి చెందాడు. పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు మ్యాన్‌హోల్‌లో మనిషి ఉన్నట్లు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు మాసయ్య మృతదేహాన్ని బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జాగృతి రంగారెడ్డి అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి



కందుకూరు: తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షురాలు కవిత శుక్రవారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ కోసం పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని అన్నారు. తనను ఎన్నుకున్నందుకు కవితకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

పత్తి సేకరణకు సన్నద్ధం

నవంబర్ మొదటి వారంలో ప్రారంభించే అవకాశం

- జిల్లాలో పత్తి రైతులు 1,25,000 మంది
- సాగు చేసింది 2,46,725 ఎకరాల్లో..
- ఉత్పత్తి అంచనా 2,68,282 మెట్రిక్ టన్నులు
- 14 కేంద్రాలు ఏర్పాటు



వికారాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సీసీఐ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో ప్రక్రియ చేపట్టనుండగా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పర్యవేక్షిస్తారు. వానలు తగ్గుముఖం పట్టి ఎండలు ప్రారంభమైతే మరో నెల రోజుల్లో పత్తి తీసే పనులు ప్రారంభిస్తారు. ఎంత మేర దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 5లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతుండగా ఎక్కువ భాగం పత్తి వేశారు. 1,25,000 మంది రైతులు 2,46,725 ఎకరాల్లో పంట వేశారు. ఈ లెక్కన ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల చొప్పున దాదాపు 2,68,282 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మొత్తాన్ని సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ కోసం స్థలం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. కాటన్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసే వేయింగ్ మిషన్లు తూనికల కొలతల శాఖ అధికారులు పరిశీలించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు.

ఈ సారైనా ఇబ్బందులు తప్పేనా?

ఐదారు సంవత్సరాలుగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఈ సారైనా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని పత్తి రైతులు కోరుతున్నారు. ఏటా వికారాబాద్, పరిగి వ్యవసాయ డివిజన్లలో పత్తి అత్యధికంగా సాగు చేస్తున్నా అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. తక్కువ సాగయ్యే తాండూరు ప్రాంతంలో మాత్రం ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పరిగి, పూడూరు మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు కొనుగోలు కేంద్రాల్లోనే పరిగి, వికారాబాద్ వ్యవసాయ డివిజన్లకు చెందిన రైతులు పత్తి విక్రయిస్తుండటంతో రద్దీ విపరీతంగా పెరుగుతోంది. దీంతో రైతులు వారాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ బాధలు భరించలేక పలువురు దళారులను ఆశ్రయిస్తున్నారు.

అంచనాలు తలకిందులయ్యే అవకాశం

మరో నెల రోజుల్లో పత్తి దిగుబడి మార్కెట్‌లోకి రానుంది. గత రెండు సీజన్లలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు పత్తి అంతంత మాత్రంగానే వచ్చింది. ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఓపెన్ మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు భారీగా వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ.8,110, సాధారణ రకానికి రూ.7,710 మద్దతు ధర నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.7వేల నుంచి రూ.7,500 వరకు ధర పలుకుతోంది. సీజన్ ప్రారంభమయ్యేనాటికి ఈ ధరలు మరిం పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు అవకాశం ఉంది. అధికారుల అంచనాలు కూడా తారుమారు కావచ్చు. అధిక వర్షాల కారణంగా ఈ సారి దిగుబడి తగ్గేలా ఉందని రైతులు అంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో పత్తి సేకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సదుపాయాలు కల్పించాలని ఆదేశించాం. 14 కేంద్రాలను ఏర్పాటు చేశాం. తూకాల్లో మోసాలకు అవకాశం లేకుండా చూస్తాం. రైతులు కూడా కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలి.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



కలెక్టరేట్‌లో గాంధీ జయంతి వేడుకల్లో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి తదితరులు

ఘనంగా గాంధీ జయంతి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన అహింస,శాంతి, సత్యం, ప్రేమ మార్గంలో నడవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

– అనంతగిరి



నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులు



అనంతగిరి: అశ్వవాహన సేవలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు



కొడంగల్: అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

అశ్వ వాహనంపై అనంతుడు

పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై విహరించారు. అంతకుముందు స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్మి చెట్టుకు పూజలు చేసి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కొడంగల్: పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దసరా పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వ వాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటి చెప్పడమే ఈ వాహనం పరమార్థమని అర్చకులు తెలిపారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేవేరుల సమేత మలయప్పస్వామి అశ్వవాహనంపై పారువేటకు బయలుదేరి బస్టాండ్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో పూజలు అందుకున్నారు. మండపం సమీపంలో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాళికామాత పల్లకీ సేవను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలయం నుంచి అమ్మవారి పల్లకీసేవ బయలు దేరి పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కాలనీల్లో భక్తులు పూజలు చేశారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- సరదాగా చెరువు చూసేందుకు వెళ్లిన 20 మంది బాలికలు
- ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరి దుర్మరణం
- దుద్యాల్ మండలం అల్లిఖాన్‌పల్లిలో ఘటన



ప్రణతి (ఫైల్)



వృక్షిత (ఫైల్)



వృక్షిత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దుద్యాల్: చెరువు అలుగు పారుతుండటంతో తోటి స్నేహితులతో కలిసి చూడటానికి వెళ్లిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తు నీట మునిగి దుర్మరణం చెందారు. ఈ ఘటన దుద్యాల్ మండలం, అల్లిఖాన్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామ సమీపంలోని చింతల్ చెరువు అలుగు పారుతోంది. దసరా సెలవులు శుక్రవారంతో ముగియనుండటంతో గ్రామానికి చెందిన 20 మంది స్నేహితులు(బాలికలు) ఉదయం సైకిళ్లపై చెరువు చూడటానికి వెళ్లారు. కొద్దిసేపు నీటిలో సరదాగా గడిపారు. గ్రామానికి చెందిన ఊదరి రాములు, లక్ష్మి దంపతుల కూతురు ప్రణతి(13), కొత్తపల్లి పాండు, అరుణ దంపతుల కూతురు వృక్షిత(12) అలుగు దాటి నీటిలో కొంత దూరం వెళ్లారు. అక్కడి గుంతలో పడి మునిగిపోయారు. అక్కడే ఉన్న ప్రణతి అక్క నందిని తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేస్తూ ఏడవడం మొదలు పెట్టారు. కొద్ది దూరంలో బట్టలు ఉతుకుతున్న మహిళలు చెరువు వద్దకు వచ్చారు. వారికి కూడా ఏం చేయాలో తెలియక అలాగే ఉండిపోయారు. చెల్లెలు ప్రణతి, మరో బాలిక వృక్షితను కాపాడుకోవాలనే తపనతో నందిని అల్లిఖాన్‌పల్లి రోడ్డు వద్దకు పరుగులు పెట్టింది. అటుగా వెళ్తున్న యువకులకు విషయం చెప్పింది. వారు చెరువు వద్దకు చెరుకొని నీట మునిగిన ప్రణతి, వృక్షితను బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. దీంతో స్నేహితులు బోరున విలపించారు. విషయం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు తెలియడంతో పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రణతి 9వ తరగతి, వృక్షిత 8వ తరగతి చదువుతున్నారు.

నిత్యం కలిసి పాఠశాలకు..

ప్రణతి, వృక్షిత నిత్యం కలిసి పాఠశాలకు వెళ్లే వారు. కలిసే భోజనం చేసేవారు. వీరిద్దరూ మంచి స్నేహితులని తోటి విద్యార్థులు తెలిపారు. తరగతులు వేరైనా ఎంతో ఆప్యాయంగా ఉండేవారని, వారు చనిపోవడం చాలా బాధేస్తోందని కన్నీరు పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ విజయరామారావు, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఈఓ తన వంతుకు రెండు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాగా చదువుకునే విద్యార్థులను కోల్పోవడం దురదృష్టకరమని ఉపాధ్యాయులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, హకీంపేట్ నర్సింహారెడ్డి తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

క్లుప్తంగా

బెల్టు షాపుపై దాడి

మద్యం బాటిళ్లు స్వాధీనం

బషీరాబాద్: స్థానిక ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పోలీసులు బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు చేస్తున్నారు. మైల్వార్ గ్రామంలోని ఓ ఇంట్లో మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ న్యుమాన్ అలీ, హెడ్ కానిస్టేబుల్ లోక్యానాయక్, కానిస్టేబుల్ నర్సింలు బుధవారం రాత్రి దాడి చేశారు. మోహన్‌గౌడ్ ఇంట్లో దాదాపు రూ.16,210 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

కంటైనర్‌లో అకస్మాత్తుగా మంటలు



చేవెళ్ల: ఓ లారీ కంటైనర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో క్యాబిన్ ముందుభాగంలో మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన బస్‌స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. షాబాద్ నుంచి శుక్రవారం చేవెళ్ల మీదుగా కంటైనర్ లారీ ఎలక్ట్రికల్ పైపులతో ముంబైకి వెళ్తోంది. పామెన బస్‌స్టేజీ వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమైన రోడ్డు పక్కన ఆపి కిందికి దిగారు. మంటలు క్యాబిన్ మొత్తం వ్యాపించాయి. స్థానికుల సాయంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఎంజీబీఎస్‌ను సందర్శించిన ఆర్టీసీ ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి శుక్రవారం మహాత్మా గాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, సీటింగ్, తదితర సదుపాయాలను పరిశీలించారు.అలాగే బస్‌స్టేషన్లలో ప్రయాణికుల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రయాణికులకు మరింత భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణ వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ఈవీ బస్సుల చార్జింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా కొన్ని బస్సుల్లోకి ఎక్కి వాటి శుభ్రత, సీటింగ్ సౌకర్యాలు, సాంకేతిక పరిస్థితులను సమీక్షించారు. అలాగే సంస్థ సిబ్బందితో, ప్రయాణికులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రు షా ఖాన్,జాయింట్ డైరెక్టర్ నర్మద,రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు



మహ్మద్ సొహైల్



పసుపులేటి అన్వేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ ఎస్సార్టీనగర్‌లో నివసించే పసుపులేటి అన్వేష్ అలియాస్ అన్నూ(24) ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తుండగా, బోరబండకే చెందిన మహ్మద్ సోహైల్(24) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వీరికి అల్లాపూర్‌కు చెందిన ఎండీ అజర్(23)తో పాటు మరో మైనర్ బాలుడు తోడయ్యాడు. వీరంతా రాత్రిపూట వీధుల్లో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్నవారిని లక్ష్యంగా చేసుకుని దారికాచి కత్తులు, బ్లేడ్లతో బెదిరిస్తూ సెల్‌ఫోన్లు, గొలుసులు, నగదు దోచుకుంటున్నారు. గత నెల 30వ తేదీన సినిమా షూటింగ్‌ల్లో పనిచేసే రహమత్ నగర్ నివాసి సాదిక్ షూటింగ్ ముగించుకుని వెళ్తుండగా మెట్రో పిల్లర్ నెంబర్ 1540 వద్ద నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఈ నలుగురు అడ్డగించి కొట్టి సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. అదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో నిఘా వేసి వీరిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్‌తో పాటు డ్యూయో బైక్‌ను స్వాధీనం చేసుకుని అన్వేష్, సోహైల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అజర్ పరారీలో ఉండగా, మైనర్ బాలుడిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

ఘనంగా బాపు జయంతి

లంగర్‌హౌస్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లంగర్‌హౌస్ బాపుఘాట్‌లో గవర్నర్, ముఖ్యమంత్రి బాపూజీ కి ఘనంగా నివాళులర్పించారు. త్రివేణి సంగమ ఒడ్డున ఉన్న బాపు సమాధి పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాపు ధ్యాన మందిరంలో జరిగిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆ తరువాత బాపుఘాట్ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి మౌనం పాటించారు. వేడుకల్లో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, స్పీకర్ గడ్డం ప్రసాద్, మహేష్ గౌడ్, గుత్తా సుఖేందర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గంలో నడవాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- పెద్దేముల్‌లో జాతిపిత విగ్రహం ఆవిష్కరణ



పరిగి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పూడూరు: చన్గోముల్‌లో గాంధీ జయంతి



అనంతగిరి: నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: జాతిపిత గాంధీ చూపిన అహింస మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దేముల్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ అనుసరించిన సత్యం, అహింస, ప్రేమ మార్గాలే దేశానికి స్వాతంత్య్రం తెచ్చిపెట్టాయని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడ ఉద్యమం జరిగినా దాని వెనుక ఉన్న స్ఫూర్తి మహాత్ముడేనని చెప్పారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన జితేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, జితేందర్ రెడ్డి, శోభారాణి, సుమిత్రబాయ్, కోహీర్ రవి, ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్, ఎల్లారెడ్డి, ఆనంద్ చారి, రియాజ్, గోపాల్, బాలప్ప పాల్గొన్నారు.



దుద్యాల్: హస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



నవాబుపేట: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఇబ్రహీంపట్నం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన ఎ.కిష్టయ్య (58) గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో అదుపు తప్పిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ప్రమాదంలో..

శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు కళాశాల వద్ద శుక్రవారం సాయంత్రం వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఉప్పరిగూడకు చెందిన బైకిస్టు భాస్కర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అతనికి భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొందుర్గు: మోటార్‌సైకిల్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని గోవులబండ తండాకు చెందిన సబావత్ శ్రీను (20) శుక్రవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై చౌదరిగూడకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వస్తుండగా జిల్లేడ్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనుకు గాయాలయ్యాయి. ఇదేకారు మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టగా మోటార్‌సైకిల్ నడుపుతున్న సబావత్ రాహుల్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగెంకలాన్‌లో ఉద్రిక్తత

- పరస్పరం దాడులు చేసుకున్న యువకులు
- నలుగురికి గాయాలు

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలోని రెండు వర్గాల యువకులు గొడవ పడ్డారు. నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఓ కిరాణా దుకాణం వద్ద సంతోష్, సాయిరెడ్డి పాత గొడవల నేపథ్యంలో ఒకరినొకరు తిట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరు వర్గాల యువకులు అక్కడికి చేరుకొని పరస్పరం దాడులు చేసుకున్నారు. రూరల్ సీఐ నగేష్, కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్, పట్టణ పోలీసులు గ్రామానికి చేరుకొని యువకులను చదరగొట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాథోడ్ వినోద్ మాట్లాడుతూ.. గొడవకు గల కారణాలు అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఇరు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించామని, పూర్తి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పండుగకు వెళ్లి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు



సాత్విక్‌రాథోడ్ మృతదేహం

కందుకూరు: పండుగకు బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలివీ.. కడ్తాల్ మండలం సలార్‌పూర్‌కు చెందిన నేనావత్ దేవేందర్, శిరీష దంపతులు. తమ ఇద్దరు కుమారులు సాత్విక్ రాథోడ్ (అలియాస్ రాము), ప్రణీత్‌తో కలిసి దసరా పండుగకు బైక్‌పై మహేశ్వరం మండలం హర్షగూడలోని బంధువుల ఇంటికి గురువారం వెళ్లారు. తిరిగి శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో మండల పరిధిలోని అలిఖాన్‌పల్లి గేట్ సమీపంలో శ్రీశైలం రహదారిపై జియో పెట్రోల్ పంపు వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కింద పడ్డ సాత్విక్‌రాథోడ్(3) అక్కడికక్కడే మృతి చెందాడు. శిరీషకు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడింది. దేవేందర్‌తో పాటు ఏడాదిన్నర వయసున్న చిన్న కుమారుడు ప్రణీత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. శిరీషను చికిత్స నిమిత్తం తుక్కుగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



స్వాతి (ఫైల్)

మహేశ్వరం: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన మారమోని శివకుమార్ భార్య స్వాతి (26) కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం మండల కేంద్రంలోని మ్యాక్స్‌వెల్ ఆస్పత్రిలో 20 రోజుల క్రితం చేరింది. వైద్యులు ఆపరేషన్ చేసిన కొద్ది రోజుల తర్వాత ఆమెకు డెంగీ జ్వరం వచ్చింది. అదే ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు ఏమీకాదులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించి మందులు రాసిచ్చి పంపించారు. తర్వాత రక్తకణాలు తగ్గి బలహీనం కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా తగ్గిపోయాయని తాము ఏమీ చేయలేమని వైద్యులు చేతులెత్తేశారు. దీంతో కుటుంబ సభ్యులు మహేశ్వరం గేటు వద్ద ఉన్న మరో ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించిందని ధ్రువీకరించారు. మ్యాక్స్‌వెల్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య స్వాతి మృతి చెందిందని భర్త శివకుమార్ ఆరోపించారు. వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా రక్తకణాలు తగ్గిపోయి, గుండె పోటు వచ్చి చనిపోయిందన్నారు. మహేశ్వరం పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు.

నైజీరియన్ డిపోర్టేషన్

నేపాల్ మీదుగా భారత్ వచ్చినట్లు గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా దేశంలోకి ప్రవేశించి, డ్రగ్ పెడ్లర్స్‌తో కలిసి సంచరిస్తున్న నైజీరియన్ జియోఫ్రీ డోజియోబిబ్‌ను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు డిపోర్ట్ చేశారు. ఈ ప్రక్రియలో ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సహకరించిందని అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటించారు. నైజీరియాకు చెందిన జియోఫ్రీ డోజియోబిబ్ 2019లో అక్రమంగా దేశంలోకి వచ్చాడు. నైజీరియా నుంచి నేపాల్ చేరిన ఇతగాడు ఎలాంటి పత్రాలు లేకుండా రోడ్డు మార్గంలో ఢిల్లీ వచ్చాడు. అక్కడ నుంచి నగరానికి చేరుకున్న జియోఫ్రీ టోలీచౌకీలో అక్రమంగా నివసిస్తున్నాడు. బెంగళూరు, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఇతగాడు కొందరు డ్రగ్ పెడ్లర్స్‌తోనూ కలిసి తిరుగుతున్నట్లు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందం జియోఫ్రీని టోలీచౌకీలో అదుపులోకి తీసుకుంది. విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పడం, ఎలాంటి పత్రాలు లేకపోవడంతో తనిఖీలు చేసింది. అతడి వద్ద ఎలాంటి మాదకద్రవ్యాలు లభించకపోవడంతో అక్రమంగా ఉంటున్న ఆరోపణలపై సీసీఎస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచింది. నగర పోలీసు ఉన్నతాధికారులు, ఎఫ్ఆర్ఆర్ఓ అధికారుల సాయంతో అవసరమైన ప్రక్రియలు పూర్తి చేశారు. ఆపై ముంబై విమానాశ్రయం నుంచి నైజీరియాకు డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా బలవంతంగా తిప్పి పంపింది.

బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్: బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి గగన్‌పహాడ్ సమీపంలో రాంకీ ప్రాజెక్టు సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని(55) వ్యక్తిని వేగంగా బైక్ నడిపిస్తున్న వ్యక్తి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు షర్ట్, ఖాకీ రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు ఉంటే ఆర్‌జీఐఏ పోలీసులను సంప్రదించాలన్నారు.

బహ్రేన్ టు హైదరాబాద్ వయా బెంగళూరు!

వ్యవస్థీకృతంగా సాగుతున్న మాదకద్రవ్యం దందా

- ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు, డెడ్‌డ్రాప్‌తో డెలివరీ
- ఇరువురు నిందితుల్ని అరెస్టు చేసిన హెచ్–న్యూ టీమ్
- 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో : నగరంలో ఉన్న డ్రగ్ పెడ్లర్ బహ్రేన్‌లో ఉన్న సప్లయర్‌కు ఆర్డర్ ఇస్తాడు. ఇతగాడు విదేశీయుల ద్వారా డెడ్‌డ్రాప్ విధానంలో బెంగళూరుకు సరుకు చేరుస్తాడు. అక్కడ ఉన్న ట్రాన్స్‌పోర్టర్ దాన్ని హైదరాబాద్ తీసుకువచ్చి డెలివరీ చేస్తాడు. ఈ పంథాలో వ్యవస్థీకృతంగా సాగుతున్న ఎండీఎంఏ డ్రగ్ దందాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) ఛేదించింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి 50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర శుక్రవారం ప్రకటించారు.

ఇన్‌స్టాగ్రాం ద్వారా ఆ నెట్‌వర్క్‌లోకి...

బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ పదో తరగతి వరకు చదివాడు. ఆపై స్థానికంగా ఉన్న ఓ బేబీ స్టోర్‌లో ఉద్యోగిగా మారాడు. యజమానికి తీవ్ర నష్టాలు రావడంతో 2024లో షాపు మూతపడి తన ఉద్యోగం కోల్పోయాడు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించిన ఉస్మాన్‌కు ఇన్‌స్టాగ్రాం యాప్ ద్వారా అశ్విన్ దాస్ రమావత్‌తో పరిచయమైంది. కేరళకు చెందిన ఇతగాడు బెంగళూరులో బీసీఏ చదివాడు. ఆపై అక్కడే కొన్ని ఉద్యోగాలు చేసినా ఈ ఏడాది ఫిబ్రవరిలో బహ్రేన్ ఉద్యోగం కావడంతో అక్కడకు వెళ్లాడు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన విదేశీయులతో కలిసి డ్రగ్ నెట్‌వర్క్ నడుపుతున్నాడు. వాట్సాప్ ద్వారా అశ్విన్‌ను సంప్రదించే ఉస్మాన్ తనకు అవసరమైన డ్రగ్ ఆర్డర్ పెట్టి, అందుకు అవసమైన మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తాడు.

డెడ్‌డ్రాప్ విధానంలో డెలివరీ...

అశ్విన్ బెంగళూరులో చదువుతున్న రోజుల్లో అదే కాలేజీలో విద్యనభ్యసిస్తున్న రాహుల్ కుమార్‌తో పరిచయమైంది. ఇద్దరూ మలయాళీలే కావడంతో వీరి మధ్య స్నేహం బలపడింది. 2024 జులైలో చదువు పూర్తయిన తర్వాత రాహుల్ అక్కడే ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగిగా చేరాడు. పని ఒత్తిడి కారణంగా కొన్నాళ్లకే మానేశాడు. అశ్విన్ ఆదేశాల మేరకు అతడి నెట్‌వర్క్‌లో ట్రాన్స్‌పోర్టర్‌గా మారాడు. ఉస్మాన్ ఇచ్చిన ఆర్డర్‌ను బట్టి అశ్విన్ కొందరు విదేశీయుల ద్వారా ఆ డ్రగ్‌ను బెంగళూరు చేరుస్తాడు. వీళ్లు నేరుగా రాహుల్‌ను కలవకుండా ఓ నిర్మానుష్య ప్రాంతంలో డ్రగ్ ప్యాకెట్ ఉంచుతారు. ఆ ఫొటో, లోకేషన్‌ను అశ్విన్‌కు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తారు. ఈ వివరాలను రాహుల్‌కు పంపే అశ్విన్ ఆ డ్రగ్ ప్యాకెట్ తీసుకోమని చెప్తాడు. ఆపై ఉస్మాన్ సహా వివిధ పెడ్లర్స్‌కు సరఫరా చేయిస్తాడు.

రూ.2 వేలకు కొని రూ.10 వేలకు విక్రయం

ఈ డ్రగ్‌ను గ్రాము రూ.2 వేలకు ఖరీదు చేస్తున్న అశ్విన్ దాన్ని ఉస్మాన్‌కు రూ.8 వేలకు సరఫరా చేస్తున్నాడు. ఈ మొత్తం నుంచి ట్రాన్స్‌పోర్టర్ రాహుల్‌ను కమీషన్ ఇస్తున్నాడు. ఉస్మాన్ కస్టమర్లకు గ్రాము రూ.10 వేలకు విక్రయిస్తున్నాడు. ఈ నెట్‌వర్క్‌పై హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్‌కు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై సి.అనంతరాములు నేతృత్వంలోని బృందం నిఘా ఉంచింది. 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ డెలివరీ చేయడానికి వచ్చిన రాహుల్, తీసుకునే ప్రయత్నం చేసిన ఉస్మాన్‌లను చాదర్‌ఘాట్ వద్ద పట్టుకుంది. ఆ ఆపరేషన్‌లో చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి చేశాయని పేర్కొన్న డీసీపీ సుధీంద్ర కేసును తదుపరి చర్యల నిమిత్తం ఆ ఠాణాకే అప్పగించామని తెలిపారు. డ్రగ్స్ దందాపై వివరాలు తెలిసిన వాళ్లు 8712661601 నెంబర్‌కు కాల్ చేసి తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపు పత్రాల అందజేత



ఇళ్ల పత్రాలు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించి కోర్టులో కేసు కారణంగా ఆగిపోయి తిరిగి కోర్టు నుంచి క్లియరెన్స్ వచ్చిన పలువురు లబ్ధిదారులకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టాలు పంపిణీ చేశారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి పత్రాలను అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో ఇళ్ల నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ చేపట్టింది. హైదరాబాద్ జిల్లాకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ ప్రచురించగా వీరికి మంకల్ ఫేజ్–2 స్థానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించారు. అందులో భాగంగా చార్మినార్, మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 75 మంది లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు.

ప్రజా ప్రయోజనాల కోసం భూములివ్వండి

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు మంత్రి పొన్నం లేఖ

సాక్షి,సిటీ బ్యూరో : హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ భూములను ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే విషయంలో సానుకూలంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు లేఖ రాశారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రికి లేఖను అందజేశారు. ఇప్పటికే కొన్ని రక్షణ భూములను ప్రజా వినియోగానికి ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు.అయితే ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నగర అభివద్ధికి, ప్రజా సౌకర్యానికి అధిక ప్రాముఖ్యత కలిగిన కొనసాగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులను అమలు చేయడానికి భూమార్పిడి కీలకమన్నారు. అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, సికింద్రాబాద్ లో నివసిస్తున్న ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కంటోన్మెంట్ నుండి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల భాగం కింద దాదాపు రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను సకాలంలో క్లియరెన్స్ చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజా మౌలిక సదుపాయాలు కల్పించడం వారికి అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించండి

గత కొనేళ్లుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని లేఖ ద్వారా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాస్వామ్య పాలన, స్థానిక ప్రాతినిధ్యం దష్ట్యా, ఈ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అభివద్ధికి కీలకమైన ఈ అంశాలపై రక్షణ మంత్రిత్వ శాఖ తగిన పరిశీలన చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ లేఖపై జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తదితరుల సంతకాలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్ రెడ్డి(ఫైల్)

మేడ్చల్ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన బడికోల్ భాస్కర్ రెడ్డి కుటుంబం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని జమున వెంచర్ లో నివాసముంటోంది. భాస్కర్ రెడ్డి కుమారుడు అజయ్ రెడ్డి(21) డిగ్రీ చదువుతూ తండ్రి నిర్వహించే వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. గురువారం దసరా పండుగ సందర్భంగా కాళకల్‌లో ఉన్న స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా రేకుల బావి ప్రాంతానికి సమీపంలో వాహనం అదుపు తప్పి, గుంతలో పడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.